క్లుప్తంగా

నేడు బాలరాజు దంపతుల పర్యటన

కొయ్యలగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి మంగళవారం కొయ్యలగూడెం మండలంలో పర్యటించనున్నారు. అచ్యుతాపురం, బోడిగూడెం పంచాయతీల పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

ముగిసిన ఉత్సవాలు


ప్రతిష్ఠించిన స్వామివారి మూలవిరాట్ విగ్రహం

కొయ్యలగూడెం: శ్రీ దాసాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉదయం 7.15 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల సౌజన్యంతో నూతనంగా నిర్మించిన ఈ ఆలయాన్ని 15వ తేదీ ప్రారంభించగా మూడు రోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి అన్న సమారాధన జరిపారు.

ఆళ్ల నానిని కలిసిన సుందర పాల్


ఆళ్ల నానిని కలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందర్ పాల్, గ్రామస్తులు

కామవరపుకోట: ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమింపబడిన మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన దాసి సుందర్‌పాల్ సోమవారం ఏలూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. పెనుమాల సంజీవరావు, అరవింద్, ఉప్పే ప్రసాద్, దాసి మోషే, పెనుమాల సంగీతరావు, దొడ్డిగర్ల నాగరాజు, సూరం జయరాజు, దాసి యాకోబు నానిని కలిసిన వారిలో ఉన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం


గురునాథరావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందాం అని పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు పేర్కొన్నారు. గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం గురునాథరావును మర్యాదపూర్వకంగా కలిసి పోలవరం అబ్జర్వర్‌గా నియమితులైన ఆయనకు అభినందనలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన వలన ఎంపీ అభ్యర్థికి లక్ష ఓట్ల మెజారిటీ, ఎమ్మెల్యే అభ్యర్థికి 50 వేల పైచిలుకు మెజారిటీ ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దిపాటి రాజకుమార్, సీనియర్ నాయకులు కోడూరి భాస్కరరావు, కె.రాజారత్నం, ఎం.శాంతారావు, వై.మోషే, టి.బాపిరాజు, కె.జీవన్‌జ్యోతి, టి.నతానియేలు, కె.భాస్కరరావు, ఎం.సుబ్బారావు, టి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో శిలువ మార్గం


తిమ్మాపురంలో శిలువ మార్గాన్ని నిర్వహిస్తున్న క్రీస్తు దీక్షాధారులు

ద్వారకాతిరుమల: మండలంలోని తిమ్మాపురం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో సంఘస్తులు, మాలధారులు సోమవారం గ్రామ పురవీధుల్లో ఏసు శిలువ మార్గాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఏసుక్రీస్తు దీక్షను స్వీకరించిన భక్తులంతా ఇలా శిలువ మార్గాన్ని నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా సాయంత్రం స్థానిక చర్చిలో దీక్షాధారులంతా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం శిలువను మోస్తూ, క్రీస్తు గీతాలాపనలు చేస్తూ, వాక్యం చెబుతూ ఈ శిలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు టి.ఏసురత్నం, నల్లంటి లక్ష్మణరావు, ఉండి వెంకటేశ్వరరావు, పి.నాగరాజు, ఎడ్లపల్లి గంగాధరరావు, సంఘ కాపరి పాస్టర్ ఆనందరావు, సంఘస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతులకు భరోసాగా.. ఆర్‌బీకేలు


పోలవరంలో రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్)


రైతులకు పంట సాగుపై సలహాలు ఇస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి (ఫైల్)


రామయ్యపేటలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

పోలవరం రూరల్: రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందించి వ్యవసాయాన్ని పండగలా మార్చారు. రైతుకు పెట్టుబడి సాయంతో ప్రారంభించి.. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాక, రైతులకు సకాలంలో సొమ్ములు అందించే విషయంలో కూడా రైతుకు భరోసా కల్పిస్తున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను స్థాపించి రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడమే కాక సకాలంలో రైతులకు అందజేస్తున్నారు. పండించే పంటలపై వ్యవసాయ శాఖ ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. జగనన్న పుణ్యమా అని రైతు కుటుంబాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. రైతుగానే కాకుండా ఆ కుటుంబంలో ముఖ్యమంత్రి అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కూడా అందుతున్నాయని, వాటితో మరింత చేదోడుగా సహకారం అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు చేసిన మేలు ఏమి లేదని, ఎరువులు, పురుగుమందుల కోసమే అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు రైతులు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందజేయడంతో మరింత సహకారం అందుతుందన్నారు.

ఆర్‌బీకేలతో రైతులకు మరిన్ని సేవలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా మట్టి నమూనా పరీక్షలు, విత్తనాల రాయితీ సరఫరా, (ఈ-క్రాప్) పంట నమోదు, ఎరువుల సరఫరా, పశువులకు దాణా, గిట్టుబాటు ధర కల్పించడం, డిజిటల్ లైబ్రెరీ ద్వారా రైతులకు అవసరమైన సమాచారంలో ధాన్యం కొనుగోలు, రైతులకు రుణాలు ఇప్పించడం, వ్యవసాయంపై సలహాలు, సూచనలు ఇవ్వడం తదితర అవసరాలు అన్నీ ఈ కేంద్రాల ద్వారానే అందించడం జరుగుతుంది.

వైఎస్సార్ రైతు భరోసా

2019 సంవత్సరంలో 6007 మంది రైతులకు రూ.8.11 కోట్లు, 2020లో 5,672 మంది రైతులకు రూ.7.50 కోట్లు, 2021లో 5,068 రైతులకు రూ.6.84 కోట్లు, 2022లో 5,730 రైతులకు రూ.7.74 కోట్లు, 2023లో 5,868 మంది రైతులకు రూ.7.92 కోట్ల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.38.11 కోట్లు జమ అయ్యాయి.

రాయితీపై విత్తనాలు

2019-20లో 429 మంది రైతులకు రూ.5.80 లక్షలు, 2020-21లో 527 మంది రైతులకు రూ.6.30 లక్షలు, 2021-22లో 789 మంది రైతులకు రూ.10.36 లక్షలు, 2022-23లో 1,674 రైతులకు రూ.22.40 లక్షలు, 2023-24 సంవత్సరానికి 2,192 మంది రైతులకు రూ.29.64 లక్షలు సబ్సిడీ విత్తనాలు, జీలుగు విత్తనాలను సరఫరా చేశారు. మొత్తం రూ.74.82 లక్షల విలువైన విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందజేసింది.

పంట రుణాలపై వడ్డీ రాయితీ

2020-21లో 1,288 మంది రైతులకు రూ.28.41 లక్షలు, 2021-22లో 1,364 మంది రైతులకు రూ.14.60 లక్షలు, 2022-23లో 1005 మంది రైతులకు రూ.22.48 లక్షల చొప్పున పంట రుణాలపై వడ్డీ రాయితీ రైతుల బ్యాంకు ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. మొత్తం రూ.65.49 లక్షలు రైతులకు అందజేసింది.

ఇన్‌పుట్ సబ్సిడీ

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు 2019-20 సంవత్సరంలో 580 మంది రైతులకు రూ.50.65 లక్షలు, 2020-21లో 583 రైతులకు రూ. 55.45 లక్షలు, 2023లో 1,192 మంది రైతులకు రూ.1.05 కోట్లు చొప్పున పంటలు నష్టపోయిన రైతులకు అందజేశారు.

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద..

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు సబ్సిడీపై అవసరమైన పనిముట్లు ప్రభుత్వం అందజేసింది. 9 గ్రూపులకు సంబంధించి 45 మంది రైతులకు 9 ట్రాక్టర్‌లు అందజేశారు. వీటి విలువ రూ.40 లక్షలు, ఐదుగురు రైతులకు రూ.9 లక్షల విలువైన కోత మిషన్ అందజేశారు. ఇవి కాకుండా ఎస్సీ ఎస్టీలకు పూర్తి రాయితీపై విత్తనాలు అందజేశారు. మండలంలో 12 రైతు భరోసా కేంద్రాలను నిర్మించి సిబ్బందిని ఏర్పాటుచేసి ఈ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఈ సేవలన్నీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. దీంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతు ప్రభుత్వంగా జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోంది.

12 రైతు భరోసా కేంద్రాలు



పోలవరం మండలంలో 12 రైతు భరోసా కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో సిబ్బందిని నియమించి రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు, సబ్సిడీపై పరికరాలు అన్నీ అందిస్తోంది. రైతులకు అందుబాటులో ఉండి సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– కె.రాంబాబు, మండల వ్యవసాయశాఖ అధికారి

పదో తరగతి పరీక్షలు ప్రారంభం


జంగారెడ్డిగూడెం: విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో జెడ్పీ బాలుర హైస్కూల్ వద్ద కోలాహలం


బుట్టాయగూడెం: కేఆర్‌పురంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న పీఓ సూర్యతేజ


పోలవరం: ఉన్నత పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8:30 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ పరిధిలో 1169 మంది విద్యార్థులకుగాను తొలిరోజు పరీక్షకు 1111 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే బుట్టాయగూడెం మండలంలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 769 మంది విద్యార్థులకు గాను 688 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 10వ తరగతి పరీక్షలకు వెళ్లే దూరప్రాంత విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. కాగా కేఆర్‌పురం ఐటీడీఏ సమీపంలోని ఉన్న గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని పీఓ ఎం.సూర్యతేజ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో స్మార్ట్ ఫోన్‌లు, వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతిలేనందున చాలా నిశితంగా పరిశీలించాలని పరీక్షా కేంద్రం నిర్వాహకులకు పీఓ ఆదేశించారు. అలాగే జీలుగుమిల్లి మండలంలో డీడీ పీవీఎస్ నాయుడు పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.

తొలిరోజు 534 మంది హాజరు

టి.నరసాపురం: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా మొత్తం 581 మంది విద్యార్థులకుగాను 534 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవోలు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి తెలిపారు. టి నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 216 మందికి గాను 187 మంది, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-ఎ కేంద్రంలో 258 మందికిగాను 248 మంది, బొర్రంపాలెం పాఠశాల-బి కేంద్రంలో 33 మందికిగాను 24 మంది, అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 74 మందికిగాను 73 మంది పరీక్షకు హాజరయ్యారు.

83 మంది గైర్హాజరు

చింతలపూడి: మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షల్లో రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 1,685 మందికి గాను మొదటి రోజు 83 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈవో జి రామారావు వెల్లడించారు. మండలంలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడంతో రూరల్ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సులు ఉండకపోవడంతో విద్యార్థులు ఆటోలను, ఇతర ప్రయాణ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తుతో పాటు, వైద్య సదుపాయం కల్పించారు.

1942 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు

జంగారెడ్డిగూడెం: మండలంలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలకు 8 కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులకు ఉదయం పరీక్షలు నిర్వహిస్తుండగా, 2 కేంద్రాల్లో ఏపీఓఎస్ఎస్ ద్వారా మధ్యాహ్నం పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం తొలి రోజు పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 1942 మంది హాజరుకాగా 70 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో బి.రాముడు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన ఏపీఓఎస్ఎస్ పదో తరగతి పరీక్షలకు 200కిగాను 175 మంది హాజరయ్యారు. అలాగే ఏపీఓఎస్ఎస్ ఇంటర్మీడియేట్ పరీక్షలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తుండగా, ఈ పరీక్షకు 112 మందికిగాను 100 మంది విద్యార్థులు హాజరయ్యారు.

946 మంది హాజరు

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో 1094 మంది విద్యార్థులకు గాను 946 మంది సోమవారం తొలిరోజు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ జె.సురేష్ బాబు పేర్కొన్నారు. ప్రారంభ రోజు కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో సహా పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చారు. విద్యార్థులకు ధైర్యం చెబుతూ పరీక్ష కేంద్రాలకు పంపారు.

52 మంది గైర్హాజరు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో మొత్తం 434 విద్యార్థులకు గాను 52 మంది విద్యార్థులు తొలిరోజు పదో తగరతి పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈవో జె.సురేష్‌బాబు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, బల్లలు, విద్యుత్ తదితర మౌలిక వసతులు సమకూర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

26 మంది గైర్హాజరు

కుక్కునూరు: పదో తరగతి పరీక్షలకు కేజీబీవీ సెంటర్ నందు 124 మందికి గాను 11మంది, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 197 మందికిగాను 15 మంది విద్యార్థులు తొలిరోజు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు చెప్పారు. రెండు పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ అచ్యుతకుమారి ఆర్ఐ వెంకట్‌తో కలిసి పరిశీలించారు.


కుక్కునూరు: పరీక్షా కేంద్రం లోపలికి వెళ్తున్న విద్యార్థులు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం


దాత రమేష్ దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ గిరిజారాణి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన నాజాని రమేష్, ప్రియాంక దంపతులు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ గిరిజారాణి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

గణపవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. రేయింబవళ్లు, పలు కూడళ్లలో వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తిరిగే వాహనాలపై మరింత నిఘా పెట్టారు. పిప్పర మూడు రోడ్ల కూడలిలో అత్తిలి, భీమవరం, గణపవరం, తాడేపల్లిగూడెం వైపు వెళ్లే వాహనాలు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఐ ఎంవీ సుభాష్ మాట్లాడుతూ రసీదులు, ఆధారాలు లేకుండా రూ.50 వేల పైబడి నగదు, రూ.10 వేల విలువైన బహుమతులు కలిగి ఉంటే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సీజ్ చేశామన్నారు. తగిన ఆధారాలు ఉంటేనే వెంట తీసుకువెళ్లాలని ప్రజలకు సూచించారు. ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మీవెంటే.. మేమంతా

బుట్టాయగూడెం: మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మిలను కలిసి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో మీవెంటే మేమంతా ఉంటామని చెప్పారు. పార్టీ గెలుపునకు సమష్టిగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ బాజీ, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాజానగరం, బుట్టాయగూడెం సచివాలయ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా కొయ్యలగూడెం మండలం గవరవరానికి చెందిన గౌడ్ యూత్ నాయకులు కూడా ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ గెలుపునకు తామంతా కృషి చేస్తామన్నారు. గౌడ్ సంఘం యూత్ నాయకులు మట్టా సత్తిపండు, పలెవెల దుర్గారావు, వేముల సత్యనారాయణ, వేముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

మోదేలు గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

బుట్టాయగూడెం: మారుమూల అటవీప్రాంతంలో జీవనం సాగిస్తున్న మోదేలు గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో బ్రిటిష్ కాలంలో ఏర్పడిన మోదేలు గ్రామంలో 25 కుటుంబాల వరకూ ఉన్నాయి. వేలేరుపాడు మండలానికి ఈ గ్రామం సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. అలాగే బుట్టాయగూడెం మండలానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. దగ్గరగా ఉండడంతోపాటు రోడ్డు మార్గం కూడా ఉండడంతో ఈ గ్రామ గిరిజనులు బుట్టాయగూడెం మండలంలోని గ్రామంలోనే పర్యటిస్తున్నారు. ఆ గ్రామ గిరిజనులకు దగ్గరగా లంకపాకల పాఠశాల ఉంది. దీనితో తమను బుట్టాయగూడెం మండలంలో కలపాలని ఐటీడీఏ అధికారులకు చెప్పుకున్నారు. అలాగే ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దృష్టికి కూడా తీసుకువచ్చారు. గిరిజనుల సమస్యల పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజల దృష్టికి తీసుకువెళ్లారు. దీనితో వారు ఒక్కొక్క సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు. మోదేలు గ్రామానికి ప్రభుత్వం రూ.3 కోట్ల నిధులు రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయడం జరిగింది. అలాగే రూ.70 లక్షలు విద్యుత్ సదుపాయం కోసం మంజూరు చేశారు. అయితే అటవీ అధికారుల అభ్యంతరాలతో ఆ పనులు నిలిచిపోయాయి. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి పీఓ ప్రత్యేక చర్యలూ చేపట్టారు. దీనిలో భాగంగా మోదేలు గ్రామ గిరిజనులు లంకపాకలలో రేషన్ బియ్యం తీసుకునే విధంగా ఏర్పాటు చేశారు. అలాగే మోదేలు గ్రామ విద్యార్థులు లంకపాకలలో చదువుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే సుమారు 10 మంది మహిళలు ఝాన్సీ రాణి డ్వాక్రా సంఘం గ్రూప్‌ను ఏర్పాటు చేసుకోగా వారిని బుట్టాయగూడెం మండలంలో రుణాలు పొందేవిధంగా ఏర్పాటు చేశారు. అలాగే త్వరలో జరిగే ఎన్నికల్లో లంకపాకలలోనే మోదేలు గిరిజనులు ఓట్లు వేసే విధంగా చర్యలు తీసుకుంటామని పీఓ తెలిపారు.


డ్వాక్రా సంఘాల సభ్యులుగా చేరిన మోదేలు గ్రామ గిరిజన మహిళలు

విద్యుత్ చౌర్యంపై కేసు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వెల్డింగ్ షాపునకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న జిల్లాలోని బుట్టాయగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలో సయ్యద్ రబ్బానీ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రబ్బానీకి రూ.62,947 అపరాధ రుసుంతో పాటు రూ.7 వేలు జరిమానా విధించామని పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రవికుమార్ హెచ్చరించారు.

గిరిజన దర్బార్ రద్దు

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రాపురం (కేఆర్‌పురం) ఐటీడీఏలో ప్రతి బుధవారం గిరిజనులు, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు ఐటీడీఏ పీఓ ఎం. సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకూ గిరిజన దర్బార్ రద్దు చేయడం జరిగిందని చెప్పారు.

ఎన్నికల కోడ్ అమలుకు అందరూ సహకరించాలి


ఎన్నికల నిర్వహణపై సమీక్షిస్తున్న ఆర్డీవో అద్దయ్య, డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు పోలీసు, రెవెన్యూ, ఎన్నికల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆర్డీవో అద్దయ్య, డీఎస్పీ రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఎన్నికల నిర్వహణపై వివిధ మీడియా, సామాజిక మాధ్యమాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని అర్థం చేసుకుని అందులో పేర్కొన్న ప్రతి అంశాన్ని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పటిష్టంగా అమలు చేసేందుకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా అభ్యర్థులు వారి ప్రచారం, ఖర్చు తదితర విషయాలపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. కావున ప్రింటింగ్ ప్రెస్, కేబుల్, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు పెయిడ్ ఆర్టికల్స్‌కు సంబంధించి జాగ్రత్తలు పాటించాలన్నారు. అభ్యర్థులకు సంబంధించి పెయిడ్ ఆర్టికల్స్‌కు అనుమతి తప్పనిసరి అన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరూ ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజేష్, తహసీల్దార్‌లు స్లీవజోజి, గోపాలకృష్ణ, కమిషనర్ నరేంద్రకుమార్, డీఎల్‌డీవో రాజు, ఎంపీడీవో ప్రసాద్ పాల్గొన్నారు.

నేటినుంచి మారెమ్మ జాతర మహోత్సవాలు

గణపవరం: గణపవరం పరిసర కొల్లేటి గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం శ్రీదండు మారెమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 19వ నుంచి ఈనెల 24వ తేదీ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆలయానికి రంగులువేసి, చలువపందిర్లు రంగురంగుల విద్యుత్ దీపాలంకరించారు. ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల ప్రారంభం రోజు మంగళవారం అమ్మవారి గవళ్ల గుడుపు సేవ కన్నుల పండుగగా నిర్వహించనున్నారు. అమ్మవారికి ఆసాదులు గరగల సేవ చేస్తారు. విద్యుత్ దీపాల వెలుగులు, గరగల నృత్యాలు, విచిత్ర వేషాలు, శక్తి వేషాలు, బుట్టబొమ్మలు, కోయడ్యాన్సులు, తీన్‌మార్ వాయిద్యాలు, కోరగేద నృత్యాలు, బాణసంచా పేలుళ్లతో అమ్మవారిని రాత్రి తెల్లవార్లు గ్రామంలో ఊరేగిస్తారు. భక్తులు అమ్మవారికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకుంటారు.